మిత్తి పైసలు ఎప్పుడస్తయో..



2



2

హత్య కేసులో ఒకరికి ఉరి శిక్ష

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

## సంక్రాంతికి సబ్సిడీపై యంత్ర పరికరాలు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ అన్నారు. రెండేళ్లో రూ.లక్ష కోట్లకు పైగా నిధులను వ్యవసాయ రంగానికి ఖర్చు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో సంక్రాంతి నుంచి సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను రైతులకు అందిస్తామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ని అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో కలిశామన్నారు. రైతు కమిషన్ సీఎంతో అనేక విషయాలపై చర్చిందని తెలిపారు. కమిషన్ పనితీరుపై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారనన్నారు. అవసరం అయితే అదనపు నిధులు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు.





నిజామాబాద్ కార్పొరేషన్‌లో..



ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని మున్సిపాలిటీల్లో పలు పనులు ఏళ్లుగా ముందుకు సాగడం లేదు. గత పాలకవర్గం హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు అలాగే నిలిచిపోయాయి. ఏళ్లుగా పనులకు మోక్షం లభించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిధులు విడుదల చేసి ఆయా పనులను వేగంగా పూర్తి చేయాలని కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం అవుతున్న నేపథ్యంలో పెండింగ్ పనులపై కథనం..

- అక్షరటుడే, ఇందూరు/ కామారెడ్డి/ ఆర్మూర్/ భీమ్‌గల్/ఎల్లారెడ్డి

**ఇందూరు:** నిజామాబాద్ నగరం.. మున్సిపాలిటీ నుంచి నగరపాలక సంస్థకు మారి ఏళ్లు గడుస్తున్నా.. సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. గత పాలకులు ఇచ్చిన హామీలు కొండంతయితే.. నెరవేరింది మాత్రం గోరంత. ప్రధానంగా నగర సుందరీకరణకు నిధులు విడుదలైనా ఆశించిన స్థాయిలో జరగలేదు. కేవలం పాత కలెక్టరేట్ చౌరస్తాలో రెండు వైపులా వాటర్ ఫౌంటెన్‌లు ఏర్పాటు చేశారు. నగరంలో మూడున్నర లక్షల జనాభా ఉన్న తిలక్ గార్డెన్ మినహాయిస్తే చెప్పుకోదగ్గ ఒక్క పార్కు కూడా లేదు. అలాగే సమీకృత మార్కెట్లు రెండు మంజూరవడంతో నిర్మాణం చేపట్టినా కేటాయింపులకు నోచుకోవడం లేదు. ప్రధానంగా మాస్టర్ ప్లాన్ అమలు చేయకపోవడంతో నిత్యం ట్రాఫిక్‌తో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతి ఎన్నికలో మాస్టర్ ప్లాన్ అమలు చేస్తామని హామీలు ఇస్తున్నా.. అది మాత్రం కలగానే నిలిచిపోతుంది.

# పురాల్లో.. పురోగతి ఏది!

- మున్సిపాలిటీల్లో నిలిచిన పనులు
- ఏళ్లుగా పెండింగ్‌లో..
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

### ఎల్లారెడ్డిలో..



ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో అసంపూర్తి పనులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎల్లారెడ్డిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు ప్రారంభించారు. నాలుగేళ్లు అవుతున్న పిల్లర్ల దశలోనే ఉంది. పట్టణవాసుల దాహార్తిని తీర్చేందుకు రెండు మంచినీటి ట్యాంకులను నిర్మించేందుకు పనులు ప్రారంభించినా.. అవి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఉన్నాయి. చాలా వీధుల్లో రోడ్లు అసంపూర్తిగా ఉండటంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఎల్లారెడ్డి మున్సిపాలిటీకి సరైన సౌకర్యాలతో భవనం అందుబాటులో లేక గతంలో ఉన్న గ్రామపంచాయతీ భవనంలోనే పరిపాలన కొనసాగుతుంది.

### ఆర్మూర్‌లో..



ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ చెరువు కట్టపై మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.2 కోట్లతో 2023 అక్టోబర్‌లో అప్పటి ఎమ్మెల్యే జీవన్ రెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్, వీధి దీపాలు, ఒక వైపు కంచెను ఏర్పాటు చేశారు. అనంతరం పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఆ తర్వాత వాకింగ్ ట్రాక్ శిథిలం అయింది. వీధీ దీపాల స్తంభాలను గుర్తు తెలియని వ్యక్తులు తీసుకువెళ్లిపోయారు. ఆర్మూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి హౌసింగ్ బోర్డ్ వరకు, హౌసింగ్ బోర్డ్ పార్క్ నుంచి

### భీమ్‌గల్‌లో..

**సమీకృత మార్కెట్ కలేనా..**

భీమ్‌గల్ పట్టణ ప్రజలకు అధునాతన సౌకర్యాలతో కూరగాయలు, మాంసం ఒకే చోట లభించేలా నిర్మించ తలపెట్టిన "సమీకృత వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్" పనులు అటకెక్కాయి. శంకుస్థాపన చేసి ఐదేళ్లు గడుస్తున్నా, నేటికీ పునాదుల దశలోనే ఉండడంపై స్థానికులు మండిపడుతున్నారు. 2021 డిసెంబర్ 7న అప్పటి ప్రభుత్వ ప్రతినిధులు ఎంతో హంగూ ఆర్భాటంతో ఈ మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. మూడు కోట్ల భారీ అంచనాతో ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించారు. కానీ నేటికీ అక్కడ కేవలం మూడు పిల్లర్లు తప్ప మరే పురోగతి కనిపించడం లేదు.

**ఆస్పత్రి కోసం నిరీక్షణ**

భీమ్‌గల్ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో 10 పడకల ఆస్పత్రికి 100 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం గతంలో నిర్ణయం తీసుకుంది. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో టీవీవీపీ నిధులు రూ.35 కోట్ల అంచనా వ్యయంతో భవన నిర్మాణానికి 2022 జూన్ 18న శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి అప్పటి ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు, రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి హాజరయ్యారు. అయితే ఆస్పత్రి పనులు నత్తన డకన సాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న 10 పడకల ఆస్పత్రిలో సౌకర్యాలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

### కామారెడ్డి జిల్లా కేంద్రంలో..

**కామారెడ్డి:** నాలుగు జిల్లాల కూడలి.. మూడు రాష్ట్రాల వారధిగా చెప్పుకొనే కామారెడ్డి మున్సిపాలిటీ అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఎన్నికలు వచ్చే ముందు గెలవడానికి అలవికాని హామీలిచ్చే నాయకులు ఎన్నికల తర్వాత మాకేంటి అన్నట్టుగా వ్యవహరించడంతో అభివృద్ధి అందని ద్రాక్షలా మారింది. కామారెడ్డి పట్టణంలో ప్రధానంగా ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. జిల్లా కేంద్రంగా మారి ఏళ్లు గడుస్తున్నా అందుకు తగినట్టుగా అభివృద్ధి జరగడం లేదనేది జగమెరిగిన సత్యం. పట్టణంలో ప్రధాన కూడళ్లయిన న్యూ బస్టాండ్, నిజాంసాగర్ చౌరస్తా, ఇందిరాచౌక్ వద్ద ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. అలాగే పట్టణంలో కోట్ల రూపాయలు వెచ్చించి డివైడర్లు నిర్మించారు. లైటింగ్ ఏర్పాటు చేసినా మున్నాళ్ల ముచ్చటగానే మారింది. వీధిదీపాల నిర్వహణ సరిగా రాత్రయితే చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఇక పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. సరైన డ్రెయినేజీలు లేక రోడ్లపైకి నీళ్లు వస్తున్నాయి. వర్షాకాలంలో పరిస్థితి వర్ణణాతీయం. ఇక కామారెడ్డిలో చేపట్టిన సమీకృత మార్కెట్ పనులు



అర్థాంతరంగా నిలిచిపోయినా పట్టించుకునే వారే కరువయ్యారు.



## త్వరలోనే ఆన్‌లైన్‌లో ప్రజావాణి: కలెక్టర్

**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న తరహాలోనే జిల్లాలోనూ ప్రజావాణి నిర్వహించేందుకు శ్రీకారం చుడతామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఆన్‌లైన్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కారం దిశగా అడుగులు వేస్తామన్నారు. ఈ మేరకు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణికి ఆయా శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి అధికారి స్థానికంగానే ఉండాలని కొందరు ఇతర జిల్లాల నుంచి వస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ముందస్తు సమాచారం లేకుండా అధికారులు ప్రజావాణికి గైర్హాజరు కాకూడదని కలెక్టర్ తెలిపారు. సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో ప్రజలు వినతులు అందిస్తారన్నారు. జిల్లా అధికారులు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. కాగా.. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 70 వినతులు అందాయి.

## జీఎస్టీ సవరణ బిల్లుతో సామాన్య ప్రజలకు ప్రయోజనం: ఎమ్మెల్యే



**అక్షరటుడే,ఎల్లారెడ్డి:** తెలంగాణ గూడ్స్ అండ్ సర్వీసెస్ (జీఎస్సీ) టాక్స్ సవరణ బిల్లు సామాన్య ప్రజలకు ప్రయోజనకరమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. రాష్ట్ర శాసనసభ సమావేశాల సందర్భంగా సోమవారం సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన తెలంగాణ (జీఎస్టీ) సవరణ బిల్లుపై ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జీఎస్టీ సవరణ బిల్లును ప్రవేశపెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 2025 సెప్టెంబర్‌లో తీసుకొచ్చిన జీఎస్టీ వల్ల తెలంగాణకు ఆర్థికనష్టం చేకూరుతుందన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లు ద్వారా వ్యాపార లావాదేవీలు మరింత సులభతరం అవుతాయని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. ఆదాయ మార్గాలను మెరుగుపరుస్తూనే ప్రజలపై భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో మొదటి స్థానంలో ఉందని గుర్తు చేశారు.

## నందిపేట్‌లో బస్‌డిపో ఏర్పాటు చేయాలి: ఎమ్మెల్యే



**అక్షరటుడే, ఆర్మూర్:** నందిపేట మండలంలో బస్‌డిపో ఏర్పాటు చేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. 1998లో ఇంటింటికి రూ.5 చొప్పున డబ్బులు జమ చేసి ఐదున్నర ఎకరాల స్థలం బస్ డిపో కోసం కొనిచ్చారని వివరించారు. అప్పటి రవాణా శాఖ మంత్రి కేసీఆర్ శంకుస్థాపన సైతం చేశారన్నారు. ఏళ్లు గడుస్తున్నా.. బస్ డిపో కలగానే మిగిలిపోయిందని చెప్పారు. ప్రస్తుతం బస్టాండ్ స్థలం కోసం గ్రామస్థులు హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. ఉత్తర తెలంగాణ నిర్లక్ష్యానికి గురవుతుంది అనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఖుద్వాన్‌పూర్ గ్రామంలో ఎస్సీ, బీసీ హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరాయన్నారు. ఆర్మూర్ పట్టణంలోని జిరాయత్ నగర్ కాలనీలో మైనారిటీల స్కూల్ భవనం శిధిలావస్థలో ఉందని వివరించారు. రెండేళ్లుగా నిధుల విషయమై మంత్రులకు విన్నవిస్తే సరే అంటున్నారే తప్ప ఒక్కరూ నిధులిచ్చింది లేదని ఆయన వాపోయారు.




## నుడా క్యాలెండర్ ఆవిష్కరణ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగర అభివృద్ధి కమిటీ క్యాలెండర్‌ను నుడా ఛైర్మన్ కేశ వేణు ఆవిష్కరించారు. సంస్థ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నుడా ఛైర్మన్ కేశవేణు మాట్లాడుతూ.. నగరం శరవేగంగా విస్తరిస్తోందన్నారు.

## కార్పొరేషన్‌పై కాషాయ జెండా ఎగరేస్తాం: బీజేపీ జిల్లా అధ్యక్షుడు

**అక్షరటుడే, ఇందూరు :** నిజామాబాద్ కార్పొరేషన్‌పై బీజేపీ జెండా ఎగరేయడం ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పాంగ్రా మాజీ సర్పంచ్, బీసీ స్థానిక నాయకులు అనుచరులతో కలిసి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యం, అవినీతి పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. నగర అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతుందని దినేస్ కులాచారి తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పేదల అభివృద్ధికి తీసుకున్న నిర్ణయాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయన్నారు. అదే నమ్మకంతో అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఓం సింగ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, రూరల్ మండల అధ్యక్షుడు ఆనంద్, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.







## జిల్లా జడ్జి, సీపీలను కలిసిన కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్ జిల్లా పాలనాధికారిగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం జిల్లా న్యాయమూర్తి జీవీఎన్ భరతలక్ష్మి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్యలను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టులోని జడ్జి ఛాంబర్‌లో న్యాయమూర్తిని కలిసి పూలమొక్కను అందించారు. జిల్లా స్థితిగతులపై, న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలపై వారు చర్చించారు. అనంతరం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. జిల్లాలో పరిస్థితులపై చర్చించారు.

– అక్షరటుడే, ఇందూరు

## సంక్రాంతికి ఊరెళ్తున్నారా.. జాగ్రత్తలు పాటించండి: సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** సంక్రాంతి పండుగ సందర్భంగా ఊరెళ్లేటప్పుడు ప్రజలు జాగ్రత్తలు వహించాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఊరు వెళ్లేటప్పుడు ఖరీదైన వస్తువులు ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్‌లో పెట్టుకోవాలన్నారు. డోర్‌లకు సెంట్రల్ లాకింగ్ సిస్టం వాడాలన్నారు. గ్రామాల్లోని ప్రజలు సంబంధిత పోలీస్ స్టేషన్ వారికి సమాచారం ఇవ్వాలన్నారు. సీసీ కెమెరాలతో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఇంటిని గమనిస్తూ ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు వస్తే వారి సమాచారం పోలీస్ వారికి తెలియజేయాలని తెలిపారు. ఇరుగుపొరుగు వారిని ఇంటిని కనిపెట్టి ఉండమని చెప్పాలని సీపీ సూచించారు.

## కాంగ్రెస్ నేతలను దూషించే హక్కు కేటీఆర్‌కు లేదు: నగేష్ రెడ్డి

**అక్షరటుడే, నిజామాబాద్‌సిటీ :** కాంగ్రెస్ నాయకులను దూషించే హక్కు కేటీఆర్‌కు లేదని నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి అన్నారు. నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న రేవంత్ రెడ్డిని కేటీఆర్ అవమానించడమంటే అది కేటీఆర్ అవివేకానికి, అహంకారానికి నిదర్శనమని నగేష్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు అమలు చేయడం లేదని కేటీఆర్ అబద్ధపు మాటలు మాట్లాడుతున్నారన్నారు. గత బీఆర్ఎస్ అధికారంలోకి రాకముందు దళితులకు మూడెకరాల భూమి, దళిత సీఎం, పేదవాళ్లకు డబుల్ బెడ్ రూం ఇళ్లు, ప్రతి ఇంటికి ఉద్యోగం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చారన్నారు. వచ్చాక ఒక్క హామీ అయినా నెరవేర్చారా అని



ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పిన హామీల మేరకు అధికారంలోకి రాగానే అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి, ప్రచార కమిటీ సభ్యులు జావిద్ అక్రం, సేవాదళ్ అధ్యక్షుడు సంతోష్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణురాజ్, నాయకులు యాదగిరి, నర్సారెడ్డి, రాజేందర్, శోభన్, కౌశిక్, దేగం గంగారెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణకు రాజకీయ పార్టీలు సహకరించాలి



**అక్షరటుడే, బాన్సువాడ :** ఓటర్ల జాబితా సవరణకు రాజకీయ పార్టీలు సహకరించాలని బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు పేర్కొన్నారు. ఈ మేరకు బాన్సువాడ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని ఓటర్ల జాబితాల పరిశీలన, కొత్తగా చేర్పులు, తొలగింపులు, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, సౌకర్యాలు వంటి అంశాలపై చర్చించారు. ఓటర్ల జాబితాలు తప్పు లేకుండా పారదర్శకంగా ఉండాలని, అర్హులైన ప్రతి ఓటరుకు ఓటుహక్కు కల్పించేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కమిషనర్ సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

## వెల్మల్‌లో వ్యవసాయ సహకార సంఘం ఏర్పాటు చేయాలి



**అక్షరటుడే, నందిపేట్ :** నందిపేట మండలంలో మేజర్ గ్రామపంచాయతీ అయిన వెల్మల్‌లో వ్యవసాయ సహకార సంఘం ఏర్పాటు చేయాలని అఖిలపక్షం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. తమ జీపీ పరిధిలో నాలుగు వేల ఎకరాల ఆయకట్టు ఉందని.. మేజర్ జీపీ అయిన తమ గ్రామాన్ని వెంటనే ఐలాపూర్ సొసైటీ నుంచి వేరు చేయాలని నాయకులు విన్నవించారు. సరిహద్దు గ్రామాలైన ఆంధ్ర నగర్, కౌల్పూర్, రైతు ఫారం, జోజిపేట గ్రామపంచాయతీల పాలకవర్గాలు ఏకగ్రీవ తీర్మానం చేశాయని.. ఈ మేరకు సొసైటీని ఏర్పాటు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవేందర్, ఉపసర్పంచ్ ఇసపల్లి మహేష్, మాజీ సర్పంచ్ మచ్చర్ల పెద్ద గంగారం, నాయకులు కస్ప రామకృష్ణ, రాము, గోజూరి నరేందర్, కిషన్, జీఆర్ రాజేందర్, మల్లేష్, శ్రీధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పిల్లల మనోవికాసానికి క్రీడలు ఎంతో అవసరం




**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో 'విజయోత్సవ్' పేరిట వార్షిక క్రీడా పోటీలను సోమవారం ఎంఈవో నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల మనోవికాసానికి చదువులతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. ఆటలతో పిల్లల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ పెరుగుతాయన్నారు. చిన్ననాటి నుంచే విద్యార్థులలో క్రీడాశక్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందని, ఇందుకు తల్లిదండ్రులు పిల్లలలో క్రీడలపై అవగాహన కల్పించేందుకు చొరవ చూపాలని పిలుపునిచ్చారు. పట్టణంలో క్రీడల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మినీ స్టేడియం ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ గంగాధర్, ఆక్స్‌ఫర్డ్ పాఠశాల ప్రిన్సిపాల్ లావణ్య నరేష్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో ఒకరికి ఉరిశిక్ష

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** హత్య కేసులో జిల్లా న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. నిందితుడికి ఉరిశిక్ష విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని బ్రాహ్మణ్‌కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ సందీప్, నాగారం కాలనీకి చెందిన సతీష్ గౌడ్ స్నేహితులు. అయితే గతేడాది ఆటో విషయంలో వీరిద్దరికి గొడవలు జరిగాయి. దీనిని మనసులో పెట్టుకున్న సతీష్ గౌడ్.. సందీప్‌ను ఎలాగైనా హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ప్రణాళిక ప్రకారం గతేడాది సతీష్ గౌడ్ సందీప్‌ను ఇందల్వాయికి తీసుకెళ్లాడు. అక్కడ ఇద్దరు మద్యం సేవించిన అనంతరం సందీప్‌ను పెట్రోల్ పోసి తగులబెట్టాడు. అనంతరం ఆటో తీసుకుని పరారయ్యాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న ఐదో టౌన్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో సతీష్ గౌడ్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును విచారించిన జిల్లా న్యాయమూర్తి డి.దుర్గా ప్రసాద్ 238 బీఎన్ఎస్ ప్రకారం.. ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, 307 బీఎన్ఎస్ కింద ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేల జరిమానా.. 103 బీఎన్ఎస్ కింద రూ.10వేలు, మరణ శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో ఏడుగురికి జరిమానా

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలో పోలీసులు డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ మేరకు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ.. పట్టణంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఏడుగురిని పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. వారిని కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున రూ.70వేల జరిమానాలు విధించినట్లు ఆయన తెలిపారు. చిన్నారులకు బైక్‌లు ఇవ్వవద్దని.. మైనర్ డ్రైవింగ్ చేస్తే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

---

మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు అందజేస్తోంది. అయితే ఇందుకు సంబంధించి వడ్డీ సొమ్మును పొదుపు ఖాతాల్లో జమ చేయట్లేదు. సుమారు తొమ్మిది నెలలుగా వడ్డీ డబ్బులు ఖాతాల్లో జమ కాకపోవడంతో డ్వాక్రా మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకు అధికారులు సైతం వడ్డీ కట్టాల్సిందేనని.. ప్రభుత్వం వడ్డీ మాఫీ చేస్తే సొమ్ము ఖాతాల్లో జమ అవుతుందని పేర్కొంటున్నారు. – అక్షరటుడే, గాంధారి



# మిత్తి పైసలు ఎప్పుడొస్తయో..

■ డ్వాక్రా మహిళల ఎదురుచూపులు.. ■ తొమ్మిది నెలలుగా పెండింగ్ ■ వడ్డీ సొమ్ము వస్తే ఖాతాల్లో జమ అవుతాయంటున్న అధికారులు

రాష్ట్రంలో 2012 వరకు పావలా వడ్డీ పథకం ఉండేది. కానీ అది కూడా మహిళలకు భారంగా మారుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆ పావలా వడ్డీని కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తూ వస్తోంది. ఇందుకు సంబంధించి ఆయా సంఘాల పేరిట వచ్చిన వడ్డీ సొమ్మును లబ్ధిదారులకు అందజేస్తు న్నారు. కానీ 2024 డిసెంబర్ నుంచి మార్చి 2025 వరకు రుణాలకు గాను నాలుగు నెలల వడ్డీ చెల్లించింది. కానీ 2025 ఏప్రిల్ 2025 నుంచి డిసెంబర్ 2025 వరకు 9 నెలల వడ్డీ లేని రుణాల జాడ కరువైంది. ఒక సంఘానికి వడ్డీ రూ.9,600 వడ్డీ వస్తే పదిమందికి పంచగా ఒక్కొక్కరికి రూ.960 వడ్డీ వచ్చినట్లు ఉంటుంది. ఇలా ఎప్పటికప్పుడు ఇస్తే బాగుంటుందని తొమ్మిది నెలలుగా వడ్డీ తిరిగి తమ ఖాతాల్లో జమ కాలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వడ్డీ డబ్బుల ఎదురు చూస్తున్నామని చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మంజూరు చేయాలని కోరుతున్నారు.

### 514 డ్వాక్రా సంఘాలు..

గాంధారి మండల కేంద్రంలో 45 జీపీల పరిధిలో 514 మహిళా సంఘాల గ్రూపులున్నాయి. అయితే 2024 డిసెంబర్ నుంచి మార్చి 2025 వరకు 514 సంఘాలకు వడ్డీ లేని రుణాలు రూ.39 లక్షలు మంజూరయ్యాయి. అయితే ఏప్రిల్ 2025 నుంచి తొమ్మిది నెలల కాలంలో రుణాలకు సంబంధించి వడ్డీ డబ్బులు రాలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### వడ్డీ డబ్బులు వస్తే ఖాతాల్లో జమచేస్తాం..

మహిళలు పదిమంది కలిసి గ్రూప్‌లో ఏర్పడి రుణం తీసుకుంటున్నారు. అయితే వడ్డీ కూడా కట్టాల్సి ఉంటుంది. రుణమాఫీ అనేది ప్రభుత్వ నుంచి రావాల్సి ఉంటుంది. అప్పటివరకు వడ్డీ డబ్బులు మాత్రం బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుంది. రుణమాఫీ మాకు ప్రభుత్వం రిలీజ్ చేస్తే వెంటనే మహిళా సంఘాల పొదుపు ఖాతాల్లో జమచేసేస్తాం.

– మల్లేశ్వరరావు, మేనేజర్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్

### తొమ్మిది నెలల వడ్డీ రావాల్సి ఉంది..

గాంధారి మండల పరిధిలో 514 సంఘాలు ఉన్నాయి. సంఘాలు తమ పరిధిలో రుణాలు తీసుకున్నారు. వడ్డీ కూడా చెల్లిస్తున్నారు. కానీ ప్రభుత్వం నుంచి రావాల్సిన రుణమాఫీ రాకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం మూడు నుంచి నాలుగు దఫాలుగా రూ.13 నుంచి రూ.14 వేల వరకు గ్రూప్‌ను బట్టి నగదు చెల్లిస్తుంది.

– ప్రసన్నకుమార్, ఐకేపీ ఏపీఎం

## నందిపేట్‌లో టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు



**అక్షరటుడే, ఆర్మూర్:** టీఎన్జీవోస్ ఆర్మూర్ యూనిట్ ఆధ్వర్యంలో నందిపేట్ మండలంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ పరిపాలన ఆఫీసర్లతో సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ ఆర్మూర్ యూనిట్ అధ్యక్షుడు కె శశికాంత్ రెడ్డి, కార్యదర్శి విశాల్, కార్యవర్గ సభ్యులు దిలీప్, శేఖర్, దశరథ్ తహశీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్, పంచాయతీ సెక్రెటరీ అసోసియేషన్ అధ్యక్షుడు అఖిల్, జీపీవో సంఘం అధ్యక్షుడు భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

## బోధన్ మున్సిపల్ ఓటర్ల జాబితా తప్పులతడక..



**అక్షరటుడే: బోధన్ :** బోధన్ మున్సిపాలిటీకి సంబంధించి విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో అనేక తప్పులు ఉన్నాయని అఖిలపక్ష నాయకులు అన్నారు. ఈ మేరకు సోమవారం మున్సిపాలిటీలో నిర్వహించిన ఆల్‌పార్టీ సమావేశంలో నాయకులు పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో సమావేశం కొద్దిసేపు రసాభాసగా సాగింది. మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో వందల సంఖ్యలో ఓట్లు తారుమారయ్యాయని వాటిని సవరించాలని నాయకులు సూచించారు. 27వ వార్డు నుంచి 160 ఓట్లు 32 వార్డుకు బదిలీ అయ్యాయని ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు ఇలియాస్ ఆరోపించారు. అదేవిధంగా 33 వార్డులో 60 ఓట్లు తప్పుగా నమోదయ్యాయని ప్రతి వార్డులో కూడా ఓటర్లు తప్పులు తడకగా నమోదు చేశారని వీటిని సవరించాలని వివిధ పార్టీల నాయకులు సూచించారు. అయితే జాబితాలో కొత్తగా ఓట్లు నమోదు చేయడం, తీసివేయడం తమ చేతిలో లేదని మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ తెలిపారు. కేవలం ఓటు షిఫ్టింగ్ మాత్రమే తమ చేతిలో ఉందని వాటిని మాత్రమే సవరిస్తామని కమిషనర్ చెప్పారు. తాము సూచించిన అభ్యంతరాలను సరిచేయకుంటే కోర్టును ఆశ్రయిస్తామని ఎంఐఎం నాయకులు తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు గోపి కిషన్, ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు ఇలియాస్, ఆమ్ ఆద్మీ నాయకుడు జునైత్ ఖాన్ పాల్గొన్నారు.

## బాల్కొండ మర్కజ్ కమిటీ అధ్యక్షుడిగా మజర్



**అక్షరటుడే, బాల్కొండ:** బాల్కొండ మర్కజ్ కమిటీ అధ్యక్షుడిగా మజర్ విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయనను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సన్మానించారు. సామాజిక సామరసత, సేవాభావంతో ముస్లిం సమాజ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ లీకేజీని పట్టించుకోరా..?



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని ఐదో డివిజన్ పరిధిలోని బోర్గాం(పి) శ్రీసాయి లక్ష్మీనగర్‌లో ఆర్నెళ్లుగా మిషన్ భగీరథ వాటర్ పైప్‌లైన్ లీకవుతున్నా అధికారులు పట్టించుకోవట్లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ లీకేజీ కారణంగా భారీ గుంత ఏర్పడడంతో పలు వాహనదారులు ఈ గుంతలో పడి గాయాలపాలయ్యారని వారు పేర్కొన్నారు. అలాగే ఈ గుంతలోనే పైప్‌లైన్ లీకేజీ నీరు నిలవడంతో తాగునీరు సైతం కలుషితమవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కాలనీలో వీధిదీపాలు లేకపోవడంతో రాత్రివేళల్లో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వారు పేర్కొన్నారు. ఈ విషయమై అధికారులకు గతంలో తెలిపినా స్పందించలేదని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.



## గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

**అక్షరటుడే, ఆర్మూర్:** గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఆలూర్ సర్పంచ్ ముక్కెర విజయ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం 'హలో ఆలూర్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సమస్యను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు గ్రామంలో సోమవారం పర్యటించినట్లు తెలిపారు. తాగునీరు, డ్రెయినేజీ, రహదారులు, విద్యుత్, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి వేగంగా పరిష్కారం చూపిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోహన్, వార్డు సభ్యులు భాస్కర్, సాయిలు, సంజీవ్, రంజిత్, సునీల్, నరేష్, అఖిల్, పంచాయతి కార్యదర్శి రాజలింగం, కరాబర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## నూతన సర్పంచ్, ఉపసర్పంచ్‌కు సన్మానం


**అక్షరటుడే, ముప్కాల్:** నూతనంగా ఎన్నికైన వేంపల్లి సర్పంచ్ ఎట్టం మహేష్ యాదవ్, ఉపసర్పంచ్ సునీత భరత్ రాజ్‌లను సోమవారం వేంపల్లి పాఠశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ రాకేష్ యాదవ్, ప్రధానోపాధ్యాయులు సైవ శ్రీనివాస్, అధ్యాపక బృందం, వార్డు సభ్యుడు రానా ప్రతాప్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.




## బోదేపల్లిలో ఎన్ఎస్ఎస్ ర్యాలీ

**అక్షరటుడే బాల్కొండ:** ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా మూడో రోజు బాల్కొండ మండలం బోదేపల్లి గ్రామంలో అక్షరాస్యత, డ్రగ్స్‌తో దుష్ఫలితాలపై ర్యాలీ నిర్వహించారు. 'డ్రగ్స్ వద్దురా – ఆరోగ్యం ముద్దురా' అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సదా మురళి, సర్పంచ్ రాజమణి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ సెక్రెటరీ, గంగారం, అనిత, యశస్వితో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రపంచ యువజన వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ




**అక్షరటుడే, భీమ్‌గల్:** వేల్పూర్ రెవెన్యూ శివారులోని శివాలయంలో నిర్వహించనున్న ప్రపంచ యువజన వారోత్సవాల పోస్టర్‌ను సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సంజయ్ ఆవిష్కరించారు. అనంతరం అవధూత రామకృష్ణ స్వామి, ధర్మ ప్రచారకుడు కంకణాల రాజేశ్వర్ మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతిని వేల్పూర్ శివాలయంలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశభక్తిని పెంపొందిస్తూ యువశక్తితో ముందుకు తీసుకుపోవాల్సిన ఆవశ్యకతను తెలిపారు. కార్యక్రమంలో శివాలయం కమిటీ ఛైర్మన్ పన్నాల రాజేశ్వర్ రెడ్డి, సలహాదారుడు బొంపల్లి గంగాధర్ గుప్తా, రామ్మోహన్, పాకాల దశాగౌడ్, వడ్నాల రమేశ్, పత్తి రాజ్ కుమార్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.